సాక్షి పెద్దపల్లి

మంగళవారం • 9 • మే • 2023



క్రమబద్ధీకరించాలి

పెద్దపల్లిరూరల్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్ష సోమవారం 11వ రోజుకు చేరింది. పెద్దపల్లిలో రవీందర్‌రెడ్డి, కిరణ్, ప్రశాంత్, రాధ, మంగ, శ్రావణ్ ఉన్నారు.



శిక్షణ తరగతులు

గోదావరిఖని: సింగరేణిలో పదోన్నతి సాధించిన అధికారులకు శిక్షణ తరగతులను ఆర్జీ–2 జీఎం మనోహర్ సోమవారం ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ, పౌరసంబంధాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కల్లెంరెడ్డిపల్లిని అభివృద్ధి చేస్తాం

- మంత్రి కొప్పుల ఈశ్వర్



సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

ధర్మారం: మారుమూల గ్రామం కల్లెంరెడ్డిపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట గ్రామపంచాయితీ పరిధిలోని కల్లెంరెడ్డిపల్లిలో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని మంత్రి ఈశ్వర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ముదిరాజ్ ఆరాధ్యదైవం పెద్దమ్మ బోనాల ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్నకొండ వరకు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాసూరి శ్రీధర్, స్థానిక నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లి అభివృద్ధే ధ్యేయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లిలోని 9వ వార్డులో సోమవారం రూ.9లక్షలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను స్థానిక కౌన్సిలర్ ఎరుకల కల్పన, రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. పట్టణ ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నట్లు వివరించారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, నాయకులు అశ్ఫక్, షకీల్, ముజ్జు, అనిల్, శౌకత్ ఉన్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర ఆదాయం రూ.8.45 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

ధర్మారం: ధర్మారం మండలం ఖిలావనపర్తిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.8.45 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఠాకూర్ హన్మాన్‌సింగ్ తెలిపారు. ఆలయం ప్రాంగణంలో సోమవారం ఈవో కాంతారెడ్డి, చైర్మన్ ఠాకూర్ హన్మాన్‌సింగ్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపుతోపాటు వివిధ రకాల వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. హుండీ ఆదాయం రూ.4లక్షల 47వేల 750, దుకాణాల వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయం రూ.3లక్షల 24వేల 700, టికెట్ల ద్వారా రూ.75వేల 375 వచ్చినట్లు చైర్మన్ వివరించారు. ఆలయ చైర్మన్ హన్మాన్‌సింగ్, సర్పంచ్ సాగంటి తార కొండయ్య, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు పాకాల రాజయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు

పెద్దపల్లిరూరల్: ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యతను విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధర్మారం మండలం చామనపల్లిలో తాపీమేస్త్రీ సంఘ భవనం నిర్మాణానికి రెండు గుంటల స్థలం కేటాయించాలని ఆ సంఘం నాయకులు కోరారు. తన భూమి సర్వే నంబర్ తప్పుగా పడిందని.. సవరించాలని శ్రీరాంపూర్‌కు చెందిన సత్తయ్య విన్నవించారు.



నూతన కమిషనరేట్‌లో తొలి సంతకం చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరీ



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మహమూద్‌అలీ, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు

మళ్లీ వస్తా.. ఐటీ పార్కు తెస్తా

- సింగరేణి అమ్మితే రామగుండం అగ్నిగుండమే..
- రైతుల ఆదాయం డబుల్ చేస్తామని కష్టాలు డబుల్ చేశారు
- రామగుండం నవనిర్మాణ సభలో మంత్రి కేటీఆర్

రామగుండం కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు విడుదల చేస్తా



హాజరైన పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు



స్టేడియంలో సభకు హాజరైన జనం

సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని/కోల్‌సిటీ(రామగుండం): రామగుండానికి మెడికల్ కాలేజీ వచ్చింది.. జూలై, ఆగస్టు నెలల్లో మరోసారి వచ్చి ఇండస్ట్రియల్, ఐటీ పార్కులను శంకుస్థాపన చేస్తానని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌లతో కలిసి మంత్రి కేటీఆర్ రామగుండం కమిషనరేట్ నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఏర్పాటు చేసిన రామగుండం నవనిర్మాణ సభలో ప్రసంగించారు. సింగరేణి తెలంగాణ కొంగు బంగారం.. రాష్ట్రానికే వెలుగుల మణిహారం.. సింగరేణి అంటే ఒక కంపెనీ కాదు.. తెలంగాణ భాగ్యరేఖ.. జీవనాడి అని పేర్కొన్నారు. సింగరేణిని అమ్మే ప్రయత్నం చేస్తే రామగుండం అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. ఉద్యమ సమయంలో నిప్పురవ్వలై కేసీఆర్ వెంట నిలబడిన కార్మికులకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను సీఎం నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. వలస పాలకులకు వ్యతిరేకంగా సింగరేణి సమ్మె చేస్తే ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో కరెంట్ ఉత్పత్తి నిలిచిపోయిందని, కార్మికుల పోరాటలను మరిచిపోలేదన్నారు.

గతంలో బెంగాల్.. నేడు తెలంగాణ

గతంలో బెంగాల్ దేశానికి దిక్సూచిగా నిలిస్తే, నేడు తెలంగాణ ఆచరించింది, దేశం అనుసరిస్తోందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ప్రధాని మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడో చెప్పాలని కోరారు. ప్రధాని మాటల్లో కోట్లల్లో ఉద్యోగాలు అంటాడు.. చేతల్లో పకోడీలు, మిర్చి బండీలు పెట్టుకోవాలంటాడని ఎద్దేవా చేశారు. రైతుల ఆదాయం డబుల్ చేస్తామని.. కష్టాలు రెట్టింపు చేశారని, నల్లచట్టాలు తెచ్చి రైతుల ప్రాణాలు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరిజలాలతో జలదృశ్యం ఆవిష్కృతమైందన్నారు. ఎమ్మెల్యే చందర్ కోరినట్లు రామగుండం కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు విడుదల అయ్యేలా చూస్తానన్నారు.

రాష్ట్రం ఆచరిస్తోంది.. దేశం అనుసరిస్తోంది

తెలంగాణ ఆచరిస్తోంది.. దేశం అనుసరిస్తోందని.. మన పాలసీలు దేశవ్యాప్తంగా అమలవుతున్నాయని రాష్ట్ర పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌ను సోమవారం ప్రారంభించారు. పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరిని సీపీ చాంబర్‌లోని సీట్లో కూర్చోపెట్టారు. అనంతరం సమావేశ మందిరంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికుడితో సమానంగా అంతర్గత భద్రత కోసం మన పోలీసులు పనిచేస్తున్నారని కొనియాడారు. అమరవీరుడు పోలీస్ కృష్ణయ్య కుటుంబాన్ని కాపాడుకున్న తీరు ప్రతీ పోలీస్ కుటుంబానికి ఒక సందేశంగా నిలవాలన్నారు. తెలంగాణ పోలీసులకు ఆధునిక భవనాలు, మంచి వాహనాలు, సాంకేతికతను వినియోగించుకునేలా అవసరమైన అన్ని పరికరాలు అందించామన్నారు. రాష్ట్ర రాజధానికి 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనూ ఆధునిక హంగులతో కూడిన భవనాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్షేత్రస్థాయిలో పోలీస్‌స్టేషన్ల నిర్వహణకు ప్రతీ నెల ప్రత్యేక బడ్జెట్ విడుదల చేస్తున్నామని చెప్పారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడొద్దని సూచించారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం

రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటు తర్వాత శాంతిభద్రతలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. గతంలో రెండు పోలీస్ కమిషనరేట్లు ఉండేవని.. ప్రస్తుతం అదనంగా ఏడు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ రూం నిర్మించుకున్నామన్నారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, డీజీపీ అంజనీకుమార్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, కలెక్టర్ సంగీతసత్యనారాయణ, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరీ, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, దీపక్ కుమార్, రామగుండం మేయర్ అనిల్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ సుమన్‌రావు, ఎస్‌ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శవంతమైన పాలన

ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికే ఆదర్శవంతమైన పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చిన నాయకుడు మంత్రి కేటీఆర్ అని కొనియాడారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ ప్రతీ కుటుంబం గౌరవంగా జీవించేలా కేసీఆర్ పథకాలు ఉన్నాయన్నారు. రామగుండం నియోజకవర్గానికి రూ.200 కోట్ల ముఖ్యమంత్రి నిధులు వచ్చాయని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ వచ్చిందన్నారు. నాలుగేళ్ల తర్వాత మొదటిసారిగా వచ్చిన మంత్రి కేటీఆర్ ఈ ప్రాంత అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయాలని కోరారు. వర్షాకాలంలో వరదల ముప్పు లేకుండా సింగరేణితో మాట్లాడి కరకట్ట నిర్మాణం చేయాలని కోరారు.

ప్రగతి పైలాన్ ఆవిష్కరణ



ప్రగతి పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో రూ.112.65 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతి పైలాన్‌ను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. రామగుండంలో పర్యటించిన సందర్భంగా.. గోదావరిఖని గాంధీనగర్‌లోని లేబర్‌కోర్టు జంక్షన్‌లో రూ.27లక్షలతో నిర్మించిన ప్రగతి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రగతి పైలాన్‌పై రూ.112.65 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల వివరాలతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. రూ.48లక్షలతో చేపట్టిన ఫైవింక్లయిన్ జంక్షన్‌లోని సుందరీకరణ పనుల శిలాఫలకాన్ని ఇక్కడే ఆవిష్కరించారు. మల్కాపూర్ శివారులో 1.2 ఎకరాల విస్తీర్ణంలో రూ.3.48 కోట్లతో నిర్మించిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎఫ్‌ఎస్‌టీపీ) శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

స్టాకు ఉన్నంత వరకు పాత ధరలే!

- ఐఎంఎల్ డిపోలో పూర్తయిన లేబులింగ్
- తగ్గిన లిక్కర్ ధరలు నేటి నుంచి విక్రయాలు
- నిమిషానికి 78 బీర్లు పీల్చేసిన పాత జిల్లా
- ఏడురోజుల్లో రూ.23 కోట్ల బీర్లు లేపిన మందుబాబులు



వారంలో కరీంనగర్ ఐఎంఎల్ డిపోలో మద్యం విక్రయాలు

లిక్కర్	విలువ
13,901 పెట్టెలు	రూ.11.12 కోట్లు
బీర్లు	**విలువ**
65,961 పెట్టెలు	రూ.23.17 కోట్లు

(మే1 నుంచి 7 వరకు జరిగిన విక్రయాలు)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'రాజు వరమిచ్చినా.. మంత్రి అడ్డుకున్నట్లు'గా ఉంది మందుబాబుల పరిస్థితి. ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించినట్లు ప్రకటించి మూడురోజులు గడుస్తున్నా.. సరుకుపై ధరలు తగ్గించకపోవడంపై మందుబాబులు మండిపడుతున్నారు. దీనిపై వైన్‌షాపుల యజమానులు మాత్రం తమకు కొత్త స్టాకు వచ్చేంత వరకు పాత ధరలే కొనసాగుతాయని చెబుతున్నారు. ఈనెల 5 నుంచి మద్యంపై ధరలను ప్రభుత్వం సవరించింది. ఫుల్‌బాటిల్‌పై రూ.40, హాఫ్ బాటిల్‌పై రూ.20, క్వార్టర్‌పై రూ.10 చొప్పున తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయని కూడా చెప్పింది. అయితే దీన్ని క్షేత్రస్థాయిలో మందుబాబులు తప్పుగా అర్థం చేసుకున్నారు. దీంతో శని, ఆది, సోమ వారాల్లో మద్యం ధరలు తగ్గాయి కదా? అంటూ వాగ్వాదానికి దిగుతున్నారు. వారికి సర్ది చెప్పడం ఎలాగో తెలియక వైన్‌షాపుల నిర్వాహకులు తల పట్టుకుంటున్నారు.

దాదాపు పూర్తయిన లేబులింగ్..

ప్రభుత్వం మద్యం ధరలను సవరించిన ప్రతీసారి ప్రభుత్వం కొత్త లేబులింగ్‌తో మద్యం సీసాలు విక్రయిస్తుంది. ఆదేశాలు వెలువడిన అనంతరం తక్షణమే అమలు కావాలి. కానీ అప్పటికే మద్యంషాపులు కొని తెచ్చుకున్న స్టాకు అలాగే ఉండిపోయింది. చాలాషాపుల్లో స్టాకు వారం పది రోజులకు ఒకసారి మారుస్తారు. పాత ధరలకు కొన్న రేట్లకే ఆ మద్యాన్ని అమ్ముకునే వీలుంది. ఎక్కువకు కొని తక్కువకు ఎవరూ విక్రయించరు కదా! ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ కూడా వీరికి పాత స్టాకును, పాత ధరలకు విక్రయించుకునేందుకు పచ్చజెండా ఊపింది. ఈలోపు ఐఎంఎల్ గోదాముల్లో ఉన్న లిక్కర్ స్టాకు లేబులింగ్ మార్చాల్సి వచ్చింది. పాత ధరలతో ఉన్న స్టాకుపై కొత్తగా సవరించిన ధరలను ముద్రించిన లేబుళ్లను వేస్తున్నారు. శని, ఆది, సోమవారాల్లోనూ ఈ ప్రక్రియ కొనసాగింది. మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌లోని వైన్‌షాపులకు వెళ్లే స్టాకుపై కొత్తగా ముద్రించిన లేబులింగ్ ప్రకారం మద్యం సీసాలు విక్రయించనున్నారు. ఈ వ్యవహారం తెలియని మందుబాబులు మాత్రం పాత ధరలకే మద్యం విక్రయిస్తున్నారంటూ యజమానులతో గొడవకు దిగుతున్నారు.

పాత ధరలకు విక్రయిస్తే చర్యలు

ధరల విషయంలో ఇప్పటికే పలువురు ఎక్సైజ్ అధికారులకు పలువురు మద్యం ప్రియులు ఫిర్యాదులు చేస్తున్నారు. పాత లేబుల్ ఉన్నవాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని పాత స్టాకు ఉన్నంత వరకు పాత ధరలు అమలవుతాయని, కొత్త లేబులింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత పాత ధరలతో విక్రయిస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

నిమిషానికి 78 బీర్లు..!

వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో బీర్లకు డిమాండ్ పెరిగింది. మే మొదలైనప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లోని మందుబాబులు బీర్లను తెగతాగేశారు. మే 1 నుంచి 7వ తేదీల్లో రూ.23.17 కోట్ల విలువైన 65,961 కాటన్ల బీర్లు అమ్ముడుపోయాయి. కాటన్‌కు 12 బీర్లు చొప్పున మొత్తం 7,91,532 బీర్లు విక్రయించారు. ఈ లెక్కన రోజుకు 1,13,076 బీర్లు, ప్రతీ గంటకు 4,711, నిమిషానికి 78 చొప్పున బీర్లు తాగేశారు. వేసవి తాపానికి మద్యంప్రియులు అంతా బీర్లకు మారుతున్నారు. లిక్కర్ ధరలో మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం బీర్ల ధరల్లో ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. అయినా మందుబాబులు మాత్రం చల్లగా బీర్లను పీల్చేస్తున్నారు.

అన్నదాతల ఆశలు ఆవిరి



వరదలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్న రైతులు

- ఉరుములు మెరుపులతో కుండపోత వాన
- కళ్లముందే కొట్టుకుపోయిన ధాన్యం
- పదిహేను రోజుల్లో నాలుగోసారి విధ్వంసం



వరద నీటిలోనే ధాన్యం

మంథని: అన్నదాతల ఆరుగాలం శ్రమ వానపాలైంది. చేతికొచ్చిన పంట వర్షపునీటిలో కొట్టుకుపోతుంటే అన్నదాతలు గుండెలవిసేలా రోదించారు. పగబట్టిన వరుణుడు పదిహేను రోజుల్లో నాలుగోసారి విధ్వంసం సృష్టించాడు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. మంథని డివిజన్‌లో వ్యాప్తంగా దాదాపు గంటకు పైగా వర్షం కురిసింది. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చిమ్మచీకట్లోనూ రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ప్రయత్నించారు. సరిపడ టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేక వర్షంలో ధాన్యం తడిసి కొట్టుకుపోయింది. గాలికి కొన్ని కుప్పలపై ఉన్న కవర్లు కూడా ఎగిరిపోయాయి. నెల రోజులుగా ధాన్యంతో పడిగాపులు కాస్తున్నా కాంటా పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం తరలించడం లేదని రైతులు వాపోతున్నారు. కొట్టుకుపోయిన ధాన్యం చేతికొచ్చే పరిస్థితి లేదని ప్రభుత్వం ఆదుకోకుంటే ఆగమవుతామని కంటతడిపెట్టారు.

సమ్మె విరమించకపోతే ఉద్యోగాలుండవ్

- కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా సమ్మె విరమించకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని కలెక్టర్ సంగీత హెచ్చరించారు. పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా నోటీసులు జారీ చేశారని తెలిపారు. జేపీఎస్‌లుగా ఉద్యోగాల్లో చేరే సమయంలో ఇచ్చిన ఒప్పందాలను ఉల్లంఘించి యూనియన్‌గా ఏర్పడ్డారని పేర్కొన్నారు. సమ్మెకు దిగడం ఒప్పందానికి విరుద్ధమన్నారు. కాంట్రాక్టు ఉద్యోగి సర్వీస్ క్రమబద్ధీకరణ వారి పనితీరు, మూల్యాంకనానికి లోబడి ఉంటుందని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సంఘంగా ఏర్పడి సమ్మెకు దిగిన కార్యదర్శులు 9వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా విధుల్లో చేరకుంటే ఉద్యోగాలు కోల్పోతారని కలెక్టర్ వివరించారు.

రెడ్‌క్రాస్ సేవలకు గుర్తింపు



అవార్డులతో కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

పెద్దపల్లిరూరల్: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ 2021–22లో అందించిన సేవలను గుర్తించి రాష్ట్ర గవర్నర్ నుంచి సేవా అవార్డు ప్రదానం చేశారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా సోమవారం అవార్డును జిల్లా కమిటీ సభ్యులు కలెక్టర్‌కు అందించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీఈవో మాధవి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్, సెక్రెటరీ వెంకటేశ్వర్లు, డాక్టర్ సంపత్‌లకు సిల్వర్‌మెడల్, ప్రశంసాపత్రాలను అందజేశారు. సొసైటీ నాయకులు అశోక్ కుమార్, శ్రీనివాస్, రాంచంద్రారెడ్డి, అజీజ్, నరేందర్ ఉన్నారు.

క్లుప్తంగా

వేపచెట్లకు టీ మస్కిటో



ఫంగస్ బారినపడిన వేప చెట్టు

రామగుండం: ఇటీవల వేపవృక్షాలు టీ మస్కి టో ఫంగస్ బారిన పడుతున్న విషయం తె లిసిందే. ఈ నేపథ్యంలో క్రమంగా రామగుండం పరిధిలోని వేపవృక్షాలు సైతం ఫంగస్ బారిన పడుతుండడంతో క్రమంగా ఆకులు ఎండిపోతున్నాయి. వేపకు సోకుతున్న ఫంగస్‌ను వృక్షశాస్త్ర అధికారులు 'డైబ్యాక్' ముప్పుగా అభివర్ణించారు. ఫంగస్ బారిన పడిన వృక్షాలకు పోషకాలు అందక క్రమంగా చచ్చిపోతుంటాయని అధికారులు పేర్కొంటున్నారు. కాగా రామగుండం పట్టణం, రైల్వేస్టేషన్, జెన్‌కో కాలనీలు, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న వేపచెట్లు ఫంగస్ బారిన పడుతున్నాయి.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం



సాబీర్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్‌కు చెందిన షేక్ సాబీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాబీర్ వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు రూ.61వేలు సోమవారం అందజేశారు. హెల్పింగ్‌హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీశ్, ఆసం శ్రీకాంత్, మేడగోని విజయ్, సాయి, మల్యాల రమేశ్, రెడ్డి చైతన్య, సాకీర్, రఘు, కుమార్, అఫ్సర్, అజయ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఈ ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆపాలని శ్రీ బాబా రాందేవ్ సేవామండల్ నాయకులు శ్యాంసుందర్ అట్టల్, దిలీప్ కోరారు. ఇటీవల పెద్దపల్లికి వచ్చిన కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలకు వినతిపత్రం అందించామని, తమ విన్నపం మేరకు మంత్రి రూపాల రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌కు లేఖరాశారని వారు వివరించారు. వీలైనంత త్వరలో పెద్దపల్లిలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు




ప్రయాణికుడికి నగదు, వస్తువులు అందిస్తున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్

మంథని: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న నగదు, వస్తువులను అప్పగించి ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ నిజాయితీ చాటుకున్నారు. సోమవారం భూపాలపల్లి నుంచి గోదావరిఖనికి వెళ్తున్న బస్సులో మండలంలోని చిల్లపల్లికి చెందిన పొట్ల పోసయ్య రూ.5వేల నగదుతోపాటు ఆధార్, ఏటీఎం, పాన్‌కార్డులను బస్సులో మర్చిపోయాడు. వస్తువులను ప్రయాణికుడికి అందించారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్, డ్రైవర్‌ను ప్రయాణికులు, డిపో మేనేజర్ శ్రీనివాస్ అభినందించారు.

యునాని వైద్యం కలేనా!

- మందులు వెనక్కి, ఖాళీగా వైద్యులు
- 50 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన దవాఖానాలు
- ఖాళీగా కన్పిస్తున్న అల్మారాలు, ఆస్పత్రులు
- ఉమ్మడి జిల్లాలో 18, పెద్దపల్లి జిల్లాలో 4.
- కరీంనగర్‌లో తప్ప ఎక్కడా అందుబాటులో లేని వైద్యులు, సిబ్బంది
- యునాని మందుల సరఫరా బంద్
- ఎత్తివేత దిశగా ఊహాగానాలు





ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఏర్పాటు చేసిన వైద్యశాల బోర్డు, యునాని వైద్యశాలకు కేటాయించిన గదిలో ఖాళీగా ఉన్న అల్మారాలు

వందల ఏళ్ల చరిత్ర గల భారతీయ ప్రాచీన వైద్యం యునానికి చెదలు పట్టినట్లైంది. ఏళ్లు గడుస్తున్నా వైద్యసేవలు అందక, సిబ్బంది లేక, ఒకప్పుడు యునాని మందులతో కళకళలాడిన అల్మారాలు ఇప్పుడు ఖాళీగా దర్శనమిస్తుండడంతో యునాని వైద్యం అంతరించిపోతుందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ఈవైద్యానికి ఎంత ప్రాముఖ్యత ఉందో చెప్పనక్కర్లేదు. అత్యంత మొండి రోగాలు సైతం యునాని వైద్యం, మందులతో పూర్తిగా నయం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అంత ప్రాముఖ్యత గల యునాని వైద్యశాలలను అధికారులు, వైద్యశాఖ పట్టించుకోకపోవడంతో ఆదరణకు నోచుకోవడం లేదు.

జూలపల్లి: ఉమ్మడి జిల్లాలో 18 యునాని వైద్యశాలలు ఉండగా కరీంనగర్లో తప్ప ఎక్కడా పర్మినెంటు వైద్యులు లేరు. నాలుగు కేంద్రాల్లో పార్ట్‌టైం వైద్యులను నియమించినా మందులు లేక రోగు లు రావడం లేదు. యునాని వైద్యశాలల మానిటరింగ్ మొత్తం వరంగల్ కేంద్రంగా నడిపిస్తుండడంతో ఇక్కడ పర్యవేక్షణ లేక యునాని వైద్యం జిల్లా ప్రజలకు అందని ద్రాక్షలా మారింది. ఉమ్మడి జిల్లా కేంద్రంతో పాటు సిరిసిల్ల, కొయ్యూరు, గంభీరావుపేట, మహదేవపూర్, ఎండపెల్లి, తిమ్మాపూర్, ఇందుర్తి, మల్యాల, ధర్మపురి, కోరుట్ల, వావిలాల, మానకొండూరు, బోయినపల్లిలో వైద్యశాలలు ఉన్నాయి. వీటిలో ఎక్కడా వైద్యసేవలు అందడం లేదు. దీంతో యునాని వైద్యం నిలిపివేస్తారనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి.

50 ఏళ్ల క్రితమే వైద్యశాలలు ఏర్పాటు...

గతంలో ప్రభుత్వం యునాని మందులకు ఉన్న పేరు ప్రఖ్యాతులను గుర్తించి ప్రత్యేకంగా వైద్య కళాశాలలను ఏర్పాటుచేసి, విద్యార్థులకు భారతీయ ఆయుర్వేద, యునాని వైద్యంలో పట్టాలు అందించింది. 50 ఏళ్ల క్రితమే గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశాలలను ఏర్పాటుచేసి ప్రజలకు వైద్యం అందించాలనే సంకల్పంతో మండలంలోని వడ్కాపూర్, రామగుండం మండలం పెద్దంపేట్-జల్లారం, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, శ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో అద్దె ఇళ్లలో యునాని వైద్యసేవలు ప్రారంభించారు. వైద్యశాలలో వైద్యుడు, కాంపౌండర్, పార్ట్‌టైం స్వీపర్ పో స్టులు కేటాయించి, మందులు సరఫరా చేయడంతో కొన్నేళ్లు గ్రామీణ నిరుపేద రోగులకు నాణ్యమైన వైద్యం అందించారు. కానీ రాను రాను నిధులు కేటాయించక, సమయానికి మందులు సరఫరా చేయక రోగుల సంఖ్య తగ్గింది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలింపు

వడ్కాపూర్‌లో అద్దె ఇంట్లో ఏర్పాటుచేసిన వైద్యశాలకు అద్దె భారమవడంతో స్థానిక పీహెచ్‌సీ భవనంలోని ఓ గదిని యునాని వైద్యశాలకు కేటాయించారు. కొన్నాళ్లు బాగానే వైద్యసేవలు అందించగా, మందులు సరఫరా సమయానికి చేయకపోవడం, సిబ్బంది నామమాత్రంగా వచ్చి వెళ్తుండడంతో రోగుల నుంచి ఆదరణ తగ్గిపోయింది. దీంతో అప్పుడప్పుడు సరఫరా చేసిన మందులను నాలుగేళ్ల క్రితమే యునాని వైద్యశాఖ అధికారులు వెనక్కి తీసుకెళ్లారు. ఇక్కడ పనిచేసిన వైద్యుడు ఏడేళ్ల క్రితం బదిలీకాగా ఎవ్వరికి పోస్టింగ్ ఇవ్వలేదు. వైద్యుడు, మందులు లేకపోవడం ఇక్కడ పనిచేస్తున్న నర్సు వచ్చివెళ్లడం తప్పా చేసే పనిలేదు. గర్రెపల్లిలో ఫార్మసిస్టు తప్పా ఎవరూ లేరు. రెండు కేంద్రాల్లో వైద్యులు మందులు, సిబ్బంది లేక పనిచేయడం లేదు. దీంతో యునాని వైద్యశాలలను ఎత్తివేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యునాని వైద్యాన్ని ఎత్తివేయొద్దని కోరుతున్నారు.

నాలుగుసార్లు పోయిన..



ప్రభుత్వ దవాఖానాలో పెట్టిన చేతి మందులు మోకాళ్ల నొప్పులకు మంచిగా పనిచేస్తాయంటే దవాఖానాకు నాలుగు సార్లు పోయిన.ఎవ్వరూ లేక పోవడంతో ప్రైవేటు దవఖానలో మందులు తెచ్చుకున్న.

– కొండ బుచ్చమ్మ, జూలపల్లి

వైద్యుడిని నియమించాలి



యునాని వైద్యశాలలో డాక్టర్‌ను నియమించాలి. మందులు పంపిస్తే రోగులు వస్తారు. చెట్ల మందులు దీర్ఘకాలం పనిచేస్తాయి. అధికారులు మందులు పంపించి డాక్టర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రాచీన వైద్యాన్ని కాపాడుకోవాలి.

– మేరుగు రమేశ్, జూలపల్లి

యునాని వైద్యం పునరుద్ధరించాలి



మొండి రోగాలను నయంచేసే గుణంగల యునాని వైద్యాన్ని కొనసాగించాలి. భారతీయ ప్రాచీన వైద్యాన్ని కాపాడుకునేందుకు దవాఖానాలను పునరుద్ధరించాలి. వైద్యులను నియమించి, మందులు పంపితే రోగులు వస్తారు. ప్రభుత్వం యునాని వైద్యాన్ని కాపాడాలి.

– విసారపు వెంకటేశం, మాజీ ఎంపీపీ, జూలపల్లి

పకడ్బందీగా ఏఈఈ పరీక్ష



జేఎన్టీయూ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్న సిబ్బంది

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలంలోని మంథని జేఎన్‌టీయూ కళాశాలలో టీఎస్‌పీఎస్‌సీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంజినీరింగ్ ఉద్యోగ నియామక (ఏఈఈ) పరీక్షను సోమవారం పకడ్బందీగా నిర్వహించారు. గతంలో పేపర్ లీక్ కావడంతో పరీక్షను రద్దు చేసింది. మళ్లీ అలాంటి సంఘటన చోటుచేసుకోకుండా పరీక్షాకేంద్రం వద్ద మంథని సీఐ సతీశ్, రామగిరి ఎస్సై రవిప్రసాద్ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కేంద్రం ద్వారం వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోనికి అనుమతించారు. ఆన్‌లైన్‌లో రెండు విడతలుగా జరిగిన పరీక్షకు 115 మందికి 76 మంది అభ్యర్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

నియామకపత్రం అందజేత



సాహిత్యకు నియామకపత్రం అందిస్తున్న ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 డివిజన్‌లోని ఓసీపీ–1లో వెల్డర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందిన జయంత్‌కుమార్ భార్య బట్టి సాహిత్యకు సింగరేణిలో ఉద్యోగం కల్పించారు. ఈమేరకు సోమవారం ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం ఎస్.రాధాకృష్ణ నియామకపత్రం అందజేశారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకయ్య, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, అధికారులు విలాస్ శ్రీనివాస్ పోద్దార్, రాజేశం, సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.



సురేశ్‌రెడ్డిని గృహనిర్బంధం చేసిన పోలీసులు



ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో అదుపులో ఉన్న ప్రతిపక్షాల నాయకులు

ముందస్తు అరెస్టులు..

గోదావరిఖని/పాలకుర్తి/జ్యోతినగర్/సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్/జూలపల్లి/యైటింక్లయిన్ కాలనీ/మంథని/కమాన్‌పూర్/పెద్దపల్లిరూరల్/ఓదెల: రాష్ట్రమంత్రి కేటీఆర్ పర్యటనతో అడుగడుగునా అరెస్టుల పర్వం కొనసాగింది. తెల్లవారుజామునుండే కార్మిక సంఘాల నేతలు, పలు పార్టీల నాయకులను పోలీసులు అరెస్ట్‌చేసి ఠాణాలకు తరలించారు. ప్రతిపక్షపార్టీలకు నిరసన తెలిపే హక్కును కాలరాశారని నాయకులు ఆరోపించారు. కేటీఆర్ పర్యటను అడ్డుకుంటారనే భారీగా పోలీసులు రంగంలోకి దిగి ఎక్కడికక్కడే అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోని పోలీసులు సుమారు 28 మంది నాయకులను అరెస్ట్‌చేసినట్లు తెలుస్తోంది. పాలకుర్తి మండల పరిధిలోని బీజేపీ నాయకులను బసంత్‌నగర్ పోలీసులు, సుల్తానాబాద్ పట్టణంలోని బీజేపీ నాయకులను, ఓదెల మండలంలోని బీజేపీ నాయకులను, యైటింక్లయిన్‌కాలనీ లోని వామపక్ష నేతలను గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంథని డివిజన్‌లో కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష పార్టీల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. బీజేపీ నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డిని హౌస్‌అరెస్టు చేశారు. పెద్దపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, నాయకుడు రాజేశ్వర్‌రావును పార్టీ ఆఫీసువద్ద, గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులను పోలీసులు గృహనిర్బంధం చేశారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు...

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కడారి సునీల్ అన్నారు. సోమవారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా జిల్లాలో అనేక ప్రాంతాల్లో వామపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో పెట్టారని, ప్రశ్నించే గొంతులను అరెస్టు చేయడం సరికాదని మండిపడ్డారు. ఎన్టీపీసీ పోలీసుల అదుపులో ఉన్న నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం ఏర్పడి పదేళ్లు గడిచినప్పటికీ, కనీస వేతన జీవోలను విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పరిస్థితులను వినతిపత్రం ద్వారా మంత్రికి తెలియజేయకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని అందజేయాలి



ధర్నా చేస్తున్న జిల్లా కో–కన్వీనర్ శ్రీనివాస్

సుల్తానాబాద్(పెద్దపల్లి): భారత రాజ్యాంగ గ్రంథాన్ని దేశంలో ప్రతి పౌరునికి ప్రభుత్వాలు ఉచితంగా అందజేయాలని డీఎస్పీ జిల్లా కో–కన్వీనర్ న్యాతరి శ్రీనివాస్ కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ సదానందంకు వినతిపత్రం అందజేశారు. న్యాతరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగ ఆవశ్యకత పౌరులందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో ఆఫీస్ ఎదుట సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతు తెలిపారు. మండలాధ్యక్షుడు శనిగరపు రాము, ఆవునూరు సతీశ్, ఏదుల శంకర్, కాదాసి రమేశ్, శనిగరం కృష్ణ మహారాజ్, ఆరెపల్లి అమర్‌రాజు, భానయ్య తదితరులు పాల్గొన్నారు.



మీడియాకు నో ఎంట్రీ

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ప్రారంభోత్సవ వార్త కవరేజీకి వెళ్లిన మీడియాను లోనికి అనుమతించలేదు. పాస్‌లు లేవన్న కారణంతో పాత్రికేయులను కమిషనరేట్ ప్రధాన గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. లోనికి పంపేందుకు ససేమిరా అన్నారు. వెనక్కి వెళ్లిపోవాలని చెప్పడంతో చేసేదేమి లేక మంత్రి కార్యక్రమానికి హాజరుకాకుండానే తిరిగి రావాల్సి వచ్చింది.

వైద్య, ఆరోగ్య శిబిరం ప్రారంభం



కమాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు


కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్య పరీక్షల కోసం కార్మికశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ప్రారంభించారు. కార్మికులు లేబర్‌కార్డు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీకాంత్, ఎంపీపీ రాసకొండ లక్ష్మి, సర్పంచులు నీలం సరిత, బొల్లపెల్లి శంకర్‌గౌడ్, తాటికొండ శంకర్, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి, మండల శాఖ అధ్యక్షుడు గుంపుల రవి, టీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీబస్సు రద్దుతో ఇక్కట్లు

ఓదెల: జిల్లాలోని ప్రముఖ ఆలయమైన ఓదెల మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే ఆర్టీసీ బస్సును రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఇటీవల మల్లికార్జునస్వామి దర్శనానికి వచ్చివెళ్లే భక్తుల కోసం ప్రారంభించారు. నెలరోజులు కాకముందే ఆర్టీసీ అధికార్లు బస్సును రద్దు చేయడంతో భక్తులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సుల్తానబాద్ నుంచి కనగర్తి, మడక మీదుగా నేరుగా గుడివద్దకు వచ్చి నైట్‌హాల్ట్ చేసేది. ప్రస్తుతం మూడురోజులుగా బస్సు గుడికి రాకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సుల్తానాబాద్ నుంచి గుండ్లపల్లె, కనగర్తి, మడక ప్రయాణికులు గుడివద్దకు రావాలంటే ప్రైవేట్ వాహనాలకు రూ.100 చెల్లించాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే బస్సును వేరే ప్రాంతానికి నడుపుతున్నట్లు భ క్తులు ఆరోపిస్తున్నారు. బస్సును తిరిగి పునరుద్ధరించాలని మండలప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ అధికార్లను కోరుతున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రా మంలో వృద్ధుడు బైరి భూపతిరెడ్డి(72) ఆదివా రం ఉరేసుకుని ఆత్మహ త్య చేసుకున్నాడు. పోలీ సులు, కుటుంబసభ్యులు వివరాల ప్రకారం.. మృతుడి భార్య వజ్రమ్మ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. జీవితంపై విరక్తితో తన పొలంలోని మామిడిచెట్టుకు ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యుల ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు రమణారెడ్డి, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.



ఫ్లై ఓవర్‌పై స్ట్రీట్‌లైట్ల పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

రామగుండం: పట్టణంలోని రైల్వేస్టేషన్ మార్గంలోని వంతెనపై స్ట్రీట్‌లైట్లను రామగుండం కార్పొరేషన్ అధికారులు పునరుద్ధరించారు. ఈనెల 6న 'సాక్షి'లో 'రామగుండం వంతెనపై చిమ్మ చీకట్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. వెంటనే వీధిదీపాలను పునరుద్ధరించారు.

కొత్తపల్లి శివారులో దారి దోపిడీ ముఠా..

- ప్రయాణికులను బెదిరించి నగదు, సెల్‌ఫోన్లు, వస్తువుల చోరీ
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- పోలీసుల అదుపులో ముఠా సభ్యులు?

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి–రేకుర్తి శివారు కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ముగ్గురు సభ్యుల ముఠా దారి దోపిడీకి పాల్పడుతోంది. రాత్రి 9 దాటిన తర్వాత రహదారిపై ఒంటరిగా వెళ్తున్న ప్రయాణికులను టార్గెట్ చేసి బైక్‌పై వెంబడిస్తూ అడ్డుకుంటున్నారు. తర్వాత వారిని చీకటి ప్రాంతంలోకి తీసుకెళ్లి కత్తిచూపుతూ భయపెడుతున్నారు. ఈక్రమంలో వారి వద్దనుంచి నగదు, సెల్‌ఫోన్, వాచ్‌లు, వస్తువులు తీసుకుని బెదిరిస్తున్నారు. ఇలాంటి ఘటన ఇటీవల కొత్తపల్లి శివారులో చోటుచేసుకుంది. అయితే రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన సిరిగిరి సాగర్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో క్యాజ్‌వాల్టీ టెక్నీషియన్‌గా పనిచేస్తూ రాత్రి 9 గంటలకు ఇంటికి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అతన్ని వెంబడించారు. కొత్తపల్లి శివారులో ప్రయాణికుడు సాగర్‌ను ఆపి పక్కనున్న చీకటి ప్రదేశానికి తీసుకెళ్లి కత్తితో బెదిరించి అతని వద్దనున్న రూ.4,200 రూ.3వేల విలువైన స్మార్ట్‌వాచ్, రూ.8వేల విలువైన సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కుని ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. అదేసమయంలో అటువైపుగా ఓ బైక్‌రావడంతో గమనించి అక్కడినుంచి పారిపోయారు. దీంతో ఊపిరిపీల్చుకున్న బాధితుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు, మిత్రుడికి జరిగిన విషయం తెలిపాడు. ఈ మేరకు సోమవారం బాధితుడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. గతంలో సైతం ఇలాంటి ఘటనలు చాలా జరిగాయని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. దారిదోపిడీకి పాల్పడ్డ ఆ ముగ్గురిని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం.